నమస్తే తెలంగాణ

# విద్యుత్‌పై వినియోగదారుల్లో అవగాహన కల్పించాలి

- సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలి
- టీజీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్



మాట్లాడుతున్న టీజీఈఆర్సీ చైర్మన్ డాక్టర్ జస్టిస్ దేవరాజు నాగార్జున్

హనుమకొండ, మార్చి 19 : విద్యుత్ వినియోగదారులకు చైతన్యం కల్పించేలా గ్రామ గ్రామాన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని టీజీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో టీజీఎన్పీడీసీఎల్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సవరించిన ఆదాయ ఆవశ్యకత, రిటైల్ సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడీ సర్ చార్జీల ప్రతిపాదనలపై బహిరంగ విచారణ నిర్వహించారు. ముందుగా ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి కంపెనీ సమగ్ర సమాచారాన్ని వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఎటువంటి విద్యుత్ టారిఫ్ పెంపు లేదన్నారు. మెరుగైన సేవలు అందిస్తున్న ఎన్పీడీసీఎల్ యాజమాన్యాన్ని అభినందించారు. సీఎండీ మాట్లాడుతూ.. గ్రీన్ ఎనర్జీని ఎంచుకునే సంబంధిత ఎల్‌టీ, హెచ్‌టీ వినియోగదారులకు సాధారణ టారిఫ్ కంటే యూనిట్‌కు రూ.0.66 గ్రీన్ టారిఫ్ విధింపు కొనసాగిస్తున్నామన్నారు. వ్యవసాయ వినియోగదారులందరికీ అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. వ్యవసాయ వినియోగదారులు రాష్ట్రంలో ఎక్కడైనా మీసేవ కేంద్రంలో తమ దరఖాస్తు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు కస్టమర్ కేర్ సెంటర్‌తో పాటు టోల్ ఫ్రీ నంబర్ 1800 425 0028, 1912 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ అధికారులందరూ నిబద్ధతతో పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. పొలాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను రోడ్డు పక్కకు మార్చడానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే జేఎల్‌ఎం, సబ్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టుల నియామకం చేపడుతామని తెలిపారు. ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సీజీఆర్ఎఫ్ చైర్మన్లు వేణుగోపాలచారి, నారాయణ, సీజీఎంలు తిరుమలరావు, అశోక్, రాజుహన్, బికంసింగ్, రవీంద్రనాథ్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆంధ్రప్రభ

# వినియోగదారులకు అంతరాయంలేని విద్యుత్ సరఫరా

**హనుమకొండ, మార్చి19 (ఆంధ్రప్రభ)**
టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో వ్యవసాయ వినియోగదారులకు అంతరాయంలేని విద్యుత్ సరఫరా అందిస్తున్నామని టిజిఎనీ ్పడీసీఎల్ సీఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో టీజీఎన్పీడీసీఎల్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సవరణ చేయబడిన ఆదాయ ఆవశ్యకత, రిటైర్డ్ సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీల ప్రతిపాదనలపై బహిరంగ విచారణ టిజిఈఆర్సీచైర్మన్ డాక్టర్ జస్టిస్ దేవరాజు నాగార్జున అధ్యక్షతన హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధ వారం జరిగింది. సీఎండి వరుణ్‌రెడ్డి మా ట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ టారిఫ్ పెంపుదల ప్రతిపాదించడం లేదని, టైమ్ఆఫ్‌డే ధరల ల్లోఎలాంటి మార్పులేదని స్పష్టం చేశారు. గ్రీన్ఎనర్జీని ఎంచుకునే సంబంధిత ఎల్టీ, హెచ్టీ విని యోగదారుల వర్గాలకు సాధారణ టారిఫ్ కంటే యూనిట్‌కు రూ.0.66 గ్రీన్ టారిఫ్ విధింపు కొనసాగించినట్లు చెప్పారు. గ్రిడ్ మద్దతు చార్జీలు నెలకు రూ.20.0 కిలో వాట్. గ్రిడ్ కేవిఏఆర్‌హెచ్‌ను అన్‌బ్లాకింగ్ చేయడం,13హెచ్‌పీ/10కిలోవాట్ అంతకంటే ఎక్కువ లోడ్ ఎల్టీ కేటకిరి-4 వినియోగదారులకు కేవిఏహెచ్ బిల్లింగ్‌ను ఆమోదించామని అభ్యర్థించారు. ఎన్పీడీసీ ఎల్ పరిధి వ్యవసాయ ఆధారప్రదేశమని, 45శాతం విద్యుత్ డిమాండ్, వ్యవసాయ డిమాండ్ ఉంటుందన్నారు. అన్ని కేటగిరి వినియోగదారులకు అంతరాయంలేని విద్యుత్ సరఫరా అందించేందుకు మౌళిక సదుపాయాలను కల్పించినట్లు చెప్పారు. టిజిఎన్పీడీసీఎల్ పరిధిలోని 24,50,795



అల్లూరి మౌనికకు ఎక్స్‌గ్రేషియా చెక్కును అందిస్తున్న ఈఆర్సీ చైర్మన్ నాగార్జున్

కుటుంబాలకు గృహజ్యోతి పథకం కింద ప్రతిఇంటికినెలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు వివరించారు. వినియోగదారుల ఫిర్యాదులను పరిష్క రించేందుకు కస్టమర్ కేర్, టోల్‌ఫ్రీ 180042 50028,1912 ద్వారా ఫిర్యాదులను పరిష్క రించబడుతున్నాయన్నారు. సీసీసీ మూడు షిఫ్టుల్లో 24 గంటలపాటు పనిచేస్తుందని, మరింతమందిఆపరేటర్లతో బలోపేతం చేస్తామన్నారు. సీసీసీఎస్ ద్వారా రోజుకు 400 ఫిర్యాదులు అందుతున్నాయని, పరి ష్కరించబడుతున్నాయని గుర్తుచేశారు. కార్పోరేషన్ ప్రాంతంలో బ్రేక్‌డౌన్లను వేగవంతంగాహాజరుకావడానికి 11ఈఆర్టీ వాహనాలు మంజూరు చేయబడ్డాయ న్నా రు. థర్మో విజన్‌కెమెరాలు, పవర్ రంపలు, టార్చ్‌లైట్లు, ముడుచుకునే నిచ్చెనలు, ఇన్సులేటర్లు, కండక్టర్లు, కేబుల్ తదితర వావానాలల్లో అమర్చిఉంటాయన్నారు. సరఫరాలను త్వరగా పునరుద్ధరించడానికి వీలుగా మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను లాగగల సామర్థ్యం ఉంటుందన్నారు. ప్రతి సోమ వారం అన్నిసెక్షన్ ఈఈఆర్ఓ, డివిజన్ సర్కి ల్, సెక్షన్ కార్యాలయాలల్లో వినియోగ దా రుల ఫిర్యాదుల పరిష్కారంకోసం ప్రజా వాణి నిర్వహిస్తున్నామని వెల్లడించారు. భారతీయ కిసాన్‌సంఘ్ తెలంగాణ నాయ కులు పలు ప్రశ్నలతో టీజీఈర్సీ చైర్మన్ దృష్టికి తీసుకరాగా, తక్షణమే పరిష్కరిం చాలని సీఎండిని ఆదేశించారు. అనంతరం కామారెడ్డి జిల్లాకు చెందిన మౌనిక తన భర్త విద్యుత్ షాక్ తో మరణించిన నష్ట పరిహా రం రాలేదని చైర్మన్ దృష్టికి తీసుకరావడం తో వెంటనే సీఎండీ వరుణ్‌రెడ్డి 5 లక్షల చెక్కును మంజూరు చేసి ఈ ఆర్ సి చైర్మన్ డాక్టర్ దేవరాజు నాగార్జున్ చేతుల మీదుగా అందచేశారు . తెలంగా ణ విద్యుత్ నియం త్రణ మండలి సెక్రటరీ వి.రామచందర్, ఎన్పీడి సిఎల్ డైరెక్టర్లు మధుసూదన్, తిరుపతిరెడ్డి, అశోక్ కుమార్, సదర్‌లాల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రతిగ్రామంలో టోల్‌ఫ్రీనంబర్లు,అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయాలి...**
**జోగినపల్లి సంపత్‌రావు**

కరీంనగర్ జిల్లాలో పట్టణ,కార్పోరేట్, డివిజన్ ప్రతి గ్రామంలో టోల్‌ఫ్రీనంబర్ ఏర్పాటుచేయాలని భారతీయ కిసాన్‌సంఘ్ తెలంగాణలైఫ్ మెంబర్ జోగినపల్లిసంపత్ రావు అన్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఎన్పీడీసిఎల్ టోల్‌ఫ్రీనంబర్ అమలులో ఉంది. కానీ ప్రతి గ్రామంలో అందుబాటులో లేదన్నారు. సీజీఆర్ఎఫ్ సమావేశాలు పెట్టే ముందు సర్పంచ్‌లకు, జెడ్పీటీసీలకు, ఎంపీటీసీలకు కరపత్రాల ద్వారా తెలుపాలన్నారు. గ్రామాలల్లో ఓవర్‌లోడ్‌తో మోటార్లు కాలీపోతున్నా యని, వెంటనే అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు.

- 2025-26 ఆర్థిక సంవత్సరానికి టారీఫ్ పెంపుదల ప్రతిపాదించడం లేదు
- ఫిర్యాదులను పరిష్కరించేందుకు కస్టమర్‌కేర్ సెంటర్,టోల్‌ఫ్రీ
- టీజిఎన్పీడీసీఎల్ సీఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఎండి వరుణ్‌రెడ్డి

ఈనాడు
epaper.eenadu.net

# విద్యుత్తు సమస్యలపై దరఖాస్తుల వెల్లువ

**హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే:** హనుమకొండ కలెక్టరేట్‌లో బుధవారం తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి(టీజీఈఆర్‌సీ), ఉత్తర విద్యుత్తు పంపిణీ కంపెనీ (టీజీఎన్పీడీసీఎల్) 2025-26 ఆర్థిక సంవత్సరానికి సమర్పించిన ఆదాయ అవశ్యకత, రిటైల్ సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడీ సర్ఛార్జీల ప్రతిపాదనలపై బహిరంగ విచారణ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి విద్యుత్తు నియంత్రణ మండలి ఛైర్మన్ డాక్టర్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ విచారణ చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రాష్ట్రంలోని 17 జిల్లాల విద్యుత్తు వినియోగదారులు అందించిన దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి ఆదేశిస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. ముందుగా ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి కంపెనీ సమగ్ర సమాచారాన్ని వివరించారు. వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ 18004250028, 1912 నంబర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మొత్తం 17 జిల్లాల నుంచి 110 దరఖాస్తులు రాగా 41 మంది నేరుగా ఛైర్మన్‌కు సమస్యలు వివరించారు.



కామారెడ్డి జిల్లా చందాపూర్‌కు చెందిన మౌనికకు పరిహారం అందజేస్తున్న ఈఆర్‌సీ ఛైర్మన్ డాక్టర్ జస్టిస్ దేవరాజు నాగార్జున్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



బహిరంగ విచారణకు హాజరైన విద్యుత్తు వినియోగదారులు, రైతు సంఘాల నాయకులు, అధికారులు

## వినతులు ఇలా....

- వ్యవసాయ రంగానికే కాకుండా వ్యవసాయ అనుబంధ రంగాలకు కూడా రాయితీపై విద్యుత్ అందించాలని నిజామాబాద్ ప్రాంతానికి చెందిన జి.దశరథ్‌రెడ్డి కోరారు.
- జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తీగల ధర్మారం గ్రామానికి చెందిన రొడ్డ తిరుమల తన వ్యవసాయ భూమిలో మోటార్ ఏర్పాటు కనెక్షన్ కోసం డీడీ చెల్లించినా, విద్యుత్ కనెక్షన్ ఇచ్చి సర్వీస్ నంబరు ఇవ్వలేదన్నారు.
- ఎల్ టీ లైను స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉన్న కారణంగా తీగలు లూజుగా ఉండి తెగుతున్నాయని మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన వల్లభనేని రవికుమార్ చెప్పారు.
- విద్యుత్తు సమస్యలపై ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరును ప్రతి గ్రామంలో ప్రదర్శించాలని, వినియోగదారుల సమస్యలను పరిష్కరించే సీజీఆర్ఎఫ్‌ను కరీంనగర్‌లో ఏర్పాటు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకుడు జోగినపల్లి సంపత్‌రావు కోరారు.
- గత అక్టోబర్ మాసంలో తన ఇల్లు విద్యుదాఘాతంతో కాలిపోగా, ఇంట్లో ఉన్న ఏడేళ్ల కుమారుడు సాయికుమార్ మరణించాడని స్పందించి పరిహారం అందించాలని కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం ఈదులగట్టెపల్లికు చెందిన అంగిడి అనిత కోరారు.
- నిజామాబాద్‌కు చెందిన విఠల్ మాట్లాడుతూ 24 గంటలూ 1912 టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేయడం అభినందనీయమని, విద్యుత్తు నియంత్రికలను విద్యుత్తు శాఖ వాహనాల్లో తరలించడం పట్ల సీఎండీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పొలాల మధ్య ఉన్న నియంత్రికలను రోడ్డు పక్కకు మార్చాలన్నారు.

## పరిహారం అందజేత

కామారెడ్డి జిల్లా చందాపూర్ గ్రామానికి చెందిన అల్వారి మౌనిక తన భర్త నర్సిరెడ్డి గతేడాది జనవరిలో తమ పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా విద్యుత్తు ప్రమాదం జరిగి మరణించారని విద్యుత్తు నియంత్రణ మండలి ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. కుటుంబ పోషణ భారంగా మారిందని, ఏడాది నుంచి నష్ట పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదని వాపోయారు. వెంటనే స్పందించిన ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి రూ.5 లక్షల చెక్కును ఛైర్మన్ చేతుల మీదుగా అందజేశారు.

Date : 20/03/2025 EditionName : TELANGANA ( HANUMAKONDA ) PageNo :

సాక్షి

# ఈఆర్‌సీకి సమస్యల గోడు

**చైర్మన్‌కు వివరించిన విద్యుత్ వినియోగదారులు**

- సీజీఆర్‌ఎఫ్ సేవలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ దేవరాజ్ నాగార్జున్
- వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం
- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



బహిరంగ విచారణకు హాజరైన టీజీ ఎన్పీడీసీఎల్ అధికారులు, విద్యుత్ వినియోగదారులు



మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

**హన్మకొండ:** విద్యుత్ నియంత్రణ మండలికి వినియోగదారులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లో 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సవరణ చేయబడిన రిటైల్ సప్లయ్ వ్యాపారానికి సమగ్ర ఆదాయ ఆవశ్యకత, ధరలు, క్రాస్ సబ్సిడీ సర్ చార్జీల ప్రతిపాదనలపై విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ ఆధ్యక్షతన బహిరంగ విచారణ జరిగింది. ఈ విచారణలో టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి.. సంస్థ ద్వారా వినియోగాదారులకు అందిస్తున్న సేవలు వివరించారు. విద్యుత్ చార్జీలు పెంచడం లేదని చెప్పారు. ఆధునిక సాంకేతికను వినియోగించి వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన సేవలు అందిస్తున్నట్లు వివరించారు. ఎన్పీడీసీఎల్‌లో అమలు చేస్తున్న సాంకేతిక పద్ధతులు, సంస్థను వినియోగదారులకు చేరువ చేసిన విధానాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

**బాధితులకు ఈఆర్‌సీ చైర్మన్ చేతుల మీదుగా చెక్కు అందజేత..**

కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం ఈదురుగడ్డకు చెందిన అంగిడి అనిత, రాజ్ కుమార్ దంపతుల ఇల్లు విద్యుదాఘాతంతో దగ్ధమైందని, ఈ ఘటనలో వారి కుమారుడు సాయి కుమార్(07) చనిపోయాడని, ఇంటి పైనుంచి విద్యుత్ లైన్ వెళ్లడం ద్వారానే ఈ ఘటన జరిగిందని భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధి జోగినిపల్లి సంపత్‌రావు ఈఆర్‌సీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. బాధితులను ఈఆర్‌సీ ముందుంచి వారి బాధను వివరించారు. ఈ ఘటన జరిగి 5 నెలలవుతున్నా ఎలాంటి పరిహారం చెల్లించలేదని తెలిపారు. స్పందించిన ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ పరిహారం చెల్లించాలని సూచించారు. దీంతో బహిరంగా విచారణ సభలోనే ఈఆర్‌సీ చైర్మన్ చేతుల మీదుగా బాధితులు అనితా, రాజ్‌కుమార్ దంపతులకు రూ.5 లక్షల చెక్కు అందించారు.

**సీజీఆర్‌ఎఫ్ సేవలు విస్తృతం చేయాలి..**

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) సేవలను మరింత విస్తృతం చేయాలని ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ అధికారులకు సూచించారు. దీనిపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. విద్యుత్ వినియోగదారులకు అందిస్తున్న సేవలకు ఎన్పీడీసీఎల్ యాజమాన్యాన్ని అభినందించారు.

**విద్యుత్ చార్జీలు పెరగవు..**

టీజీ ఎన్పీడీసీఎల్ రెవెన్యూ లోటు రూ.10,393 కోట్లు. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ నిర్వహణకు రూ.19,814 కోట్ల ఆదాయం అవసరం కాగా, రూ.9,421 కోట్లు మాత్రమే ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. దీంతో రెవెన్యూ భారీ లోటు ఏర్పడనుంది. ప్రభుత్వం ఈ మేరకు రీయింబర్స్ చేయాల్సిన అవసరముంది. అదే విధంగా ఈ సంవత్సరం విద్యుత్ చార్జీల టారిఫ్ పెంపుపై ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు. దీంతో విద్యుత్ చార్జీలు పెరగవు. విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి భారం పడదు.

## ఈఆర్‌సీ చైర్మన్‌కు సమస్యలు విన్నవించిన వినియోగదారులు



బహిరంగ విచారణకు అధ్యక్షత వహించిన ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్

టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాల నుంచి వినియోగదారులు హనుకొండ కలెక్టరేట్‌కు చేరుకుని తమ సమస్యలను ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్‌కు వివరించారు. వీరితో భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు వినియోగదారులకు జరుగుతున్న ఇబ్బందులు, కంపెనీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు అందించారు. ఆగ్రో బేస్డ్ పరిశ్రమలకు విద్యుత్ టారిఫ్‌లో రాయితీ ఇవ్వాలని వినియోగదారులు కోరారు. రాయితీ లేక ఈ రంగంలో పరిశ్రమలు రావడం లేదన్నారు. అదే విధంగా 2011లో ట్రాన్స్‌కో రాతపూర్వకంగా ఇచ్చిన ఆదేశాల మేరకు కాటన్ ఇండస్ట్రీస్ నడిపిస్తే ఆ తర్వాత జరిమానా విధించారని వాపోయారు. వడ్డీ విధిస్తూ ఎరియర్స్‌గా చూపిస్తున్నారని, 18 ఇండస్ట్రీస్‌కు రూ.15 నుంచి రూ.30 లక్షల వరకు జరిమానా విధించారని, వీటిని రద్దు చేయాలని కోరారు. రైతులు తమ వ్యవసాయ మోటార్ల వద్ద ఓల్టేజీ తెలుసుకోవడానికి 20 ఆంప్స్ విద్యుత్ బల్బులు వాడుకునేందుకు అనుమతి ఉందని, అయితే న్యూట్రల్ వైర్ లేక వినియోగించుకోలేక పోతున్నామని, వ్యవసాయ సర్వీస్ లైన్‌లకు న్యూటల్ లైన్ వేయాలని కోరారు. అదే విధంగా పంట పొలాల మధ్య ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను రోడ్డు సౌకర్యం ఉన్న ప్రాంతానికి తరలించడానికి రైతులను డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని, దీనికి స్వస్తి పలికి సంస్థనే ఉచితంగా తరలించాలని కోరారు. రైతులు మారినప్పుడు వ్యవసాయ సర్వీస్‌లో పేర్లు మార్చే విధానం సులభతరం చేయాలని కోరారు. చాలా గ్రామాలకు జూనియన్ లైన్‌మెన్లు, లైన్‌మెన్‌లు లేరని, వెంటనే నియమించాలని కోరారు. ఇళ్ల పైనుంచి వెళ్తున్న విద్యుత్ లైన్లను ఎలాంటి చార్జీలు విధించకుండా మార్చాలని కోరారు. వినియోగదారులు ఇంకా చాలా సమస్యలు ఈఆర్‌సీ దృష్టికి తీసుకెళ్లగా వాటిని పరిష్కరించాలని ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్..టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డిని ఆదేశించారు.